సాక్షి గుంటూరు

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



మ్యూజియంలో స్వచ్ఛభారత్

అమరావతి: స్థానిక పురావస్తు మ్యూజియంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం ప్రారంభించారు. మ్యూజియం ఇన్‌చార్జి చినబాబు మాట్లాడారు.



రథయాత్రకు విశేష స్పందన

భట్టిప్రోలు: శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి రథయాత్రకు విశేష స్పందన లభించింది. టీటీడీ నుంచి ఏర్పాటు చేసిన రథయాత్ర శనివారం భట్టిప్రోలు చేరుకుంది.



విద్యార్థినుల ర్యాలీ

గుంటూరుఎడ్యుకేషన్ : జేకేసీ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం ఎన్ఎస్ఎస్ దినోత్సవం సందర్భంగా విద్యార్థినులు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

న్యూస్‌రీల్

పాలక మండలికి దరఖాస్తు చేసుకోండి

అమరావతి: అమరావతిలోని అమరేశ్వరస్వామి దేవస్థానం వ్యవస్థాపకేతర పాలకమండలి సభ్యుల నియామకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపీనాథశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకమండలి సభ్యత్వంపై ఆసక్తి ఉన్నవారు వచ్చేనెల 12వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసేవారు తప్పనిసరిగా హిందువులై ఉండాలన్నారు. మిగిలిన వివరాలకు దేవాలయ కార్యాలయంలో పని వేళలలో సంప్రదించాలన్నారు.

నేడు తెనాలికి వందేభారత్ రైలు

తెనాలిరూరల్: వందే భారత్ రైళ్లను ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. చెన్నై–విజయవాడ వందే భారత్ రైలుకు తెనాలిలో హాల్ట్ కల్పించారు. ఈ నేపథ్యంలో రైలుకు స్వాగతం పలికేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. తెనాలి రైల్వేస్టేషన్‌లో ఆదివారం ఉదయం 11.40 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని స్టేషన్‌మేనేజర్ టీవీ రమణ శనివారం తెలిపారు. ప్రజలందరూ వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

పొన్నూరులో 11.2 మి.మీ వర్షం



కొరిటిపాడు(గుంటూరు) : గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా పొన్నూరు మండలంలో 11.2 మిల్లీమీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా గుంటూరు తూర్పులో 0.4 మి.మీ వర్షం పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి... కొల్లిపర 10.2, కాకుమాను 9.6, ప్రత్తిపాడు 8.8, పెదనందిపాడు 7.4, చేబ్రోలు 4.8, ఫిరంగిపురం 3.8, దుగ్గిరాల 1.8, వట్టిచెరుకూరు 1.8, గుంటూరు పశ్చిమ 1.8, తుళ్ళూరు మండలంలో 0.8 మి.మీ చొప్పున వర్షం పడింది. సెప్టెంబర్ మాసం 23వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 107.7 పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 178 మి.మీ వర్షపాతం నమోదైంది.

నేటి నుంచి నృసింహుని పవిత్రోత్సవాలు



మంగళగిరి : శ్రీలక్ష్మీ నృసింహస్వామి పవిత్రోత్సవాలు ఆదివారం ఉదయం అకల్మష హోమంతో ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈఓ రామకోటిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు సాయంత్రం విష్వక్సేనారాధన, అఖండ దీపారాధన, ఋత్విగ్వరణము, నవ కుంభారోహణ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 25, 26 వ తేదీల్లో ప్రత్యేక పూజలు, పవిత్ర సమర్పణ నిర్వహించి చివరి రోజు 27వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు శ్వేత పుష్పాలంకార రథ గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి పవిత్రోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

పీవీకే నాయుడు మార్కెట్‌కు తొలి అడుగు

- టెండర్లు ఆహ్వానం
- త్వరలో కార్యరూపం దాల్చనున్న ప్రాజెక్టు
- ఇప్పటికే రూ.163 కోట్లతో పరిపాలనా అనుమతులు
- పూర్తయిన న్యాయ సమీక్ష
- 5.40 లక్షల చదరపు అడుగుల్లో రెండు సెల్లార్లు, 8 అంతస్తులతో నిర్మాణం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు నగర ప్రజల చిరకాల వాంఛగా ఉన్న పీవీకే నాయుడు మార్కెట్ నిర్మాణానికి మార్గం సుగమం అయ్యింది. ఈ అంశానికి సంబంధించిన న్యాయ సమీక్ష కూడా పూర్తి కావడంతో ఈ నెల 20న కార్పొరేషన్ అధికారులు టెండర్లు ఆహ్వానించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన మార్కెట్ స్థానంలో అధునాతన హంగులతో నగరానికే ఐకానిక్‌గా ఉండేలా నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటికే డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టును తయారుచేశారు. దీనికి సంబంధించిన న్యాయ సమీక్షను పూర్తిచేసి ఏక మొత్తంగా నిర్మాణం చేసేందుకు ఈ–ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో టెండర్లు ఆహ్వానించారు. ఈనెల 20న టెండర్లు ఆహ్వానించగా, 30వ తేదీన ప్రీబిడ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. అందులో వచ్చిన అనుమానాలను వచ్చే నెల ఐదున నివృత్తి చేస్తారు. అక్టోబర్ ఏడో తేదీ నాటికి టెండర్లు దాఖలు చేయాల్సి ఉంటుంది.

నగరం నడిబొడ్డున ఉన్న పీవీకే(పి వెంకటకృష్ణమ నాయుడు) నాయుడు కాంప్లెక్స్ నిర్మాణానికి బీజం పడింది. 1.92 ఎకరాల్లో రూ.163 కోట్లతో 5.40లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక హంగులతో జీ ప్లస్ 8తోపాటు రెండు సెల్లార్లు(పార్కింగ్) ఉపయోగించే విధంగా భవన



పీవీకే నాయుడు కాంప్లెక్స్ నమూనా

సముదాలకు సంబంధించిన నిర్మాణానికి ప్రభుత్వం గతేడాది డిసెంబర్ నెలలో అనుమతులు మంజూరు చేసింది. 1.92 ఎకరాల్లో విస్తరించి ఉన్న పీవీకే నాయుడు మార్కెట్ అభివృద్ధి చేసేందుకు పాలకవర్గం, అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

ఘన చరిత్ర ఉన్న మార్కెట్

పి వెంకటకృష్ణమనాయుడు(పీవీకే నాయుడు) 1945 సంవత్సరంలో 1.92 ఎకరాల భూమిని గుంటూరు నగరపాలక సంస్థకు ఉచితంగా అందజేశారు. సదరు ప్రాంతంలో నగరపాలక సంస్థ షాపులు నిర్మించి కూరగాయాలు, పండ్లు, పూలు, ఇతర వర్తక వ్యాపారస్తులకు అద్దెకు ఇచ్చి వారి నుంచి ఆశీలు రూపంలో సంవత్సరానికి సుమారు రూ.20లక్షలు వసూలు చేసేది. భవనం పాతపడటంతో అక్కడక్కడ పెచ్చులు ఊడిపోతూ కూలిపోయే దశకు రావడంతో 2015 సంవత్సరంలో పీవీకే నాయుడు మార్కెట్‌ను నగరపాలక సంస్థ అధికారులు కూల్చివేశారు. గతంలో వ్యాపారాలు నిర్వహించుకున్న వారికి నూతన భవనంలో షాపులు కేటాయించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే గతంలో ఎంత మంది పీవీకే నాయుడు మార్కెట్‌లో వ్యాపారం నిర్వహించారో వారి వివరాలు సేకరించారు. వారికి ప్రభుత్వ నియమనిబంధనలకు మేరకు షాపులు కేటాయించనున్నారు. అత్యాధునిక హంగులతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా మార్కెట్‌ను అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. రెండు సెల్లార్లు, 8 అంతస్తులతో నిర్మాణం చేపట్టనున్నారు. దీని కోసం నగరానికి చెందిన మేయర్, కమిషనర్‌తోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రభుత్వం వద్దకు వెళ్లి పరిపాలనా అనుమతులు రావడానికి కృషి చేశారు. ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లో ఈ ఏడాదిలోనే పనులు ప్రారంభించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పెద్ద ప్రాజెక్టు కావడంతో దీనికి అర్హత ఉన్న పలువురు కాంట్రాక్టర్లను టెండర్లు వేసి బిడ్‌లో పాల్గొనేలా వారిని సమాయత్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే గుంటూరు నగరానికి ప్రతిష్టాత్మకంగా నిలవనుంది.

రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- జాయింట్ కలెక్టర్ రాజకుమారి
- జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష క్షేత్రస్థాయి పరిశీలన



రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ జి రాజకుమారి తదితరులు

గుంటూరురూరల్: రెవెన్యూ విభాగంలోని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపటం జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ముఖ్యోద్దేశమని జిల్లా జాయింట్ కలెక్టర్ జి రాజకుమారి అన్నారు. వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామంలో జరుగుతున్న జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష ఫేజ్–3 రీసర్వేను క్షేత్రస్థాయిలో ఆమె శనివారం పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష ఫేజ్–3లో భాగంగా జిల్లాలో 25 గ్రామాలకు సంబంధించి 30,995 రాళ్లను పంపగా ఇప్పటివరకు 25,380 రాళ్లను సర్వే చేసి పాతించినట్లు తెలిపారు. రీసర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించి భూహక్కు పత్రాలు ఇప్పటివరకు 13,132 పట్టాలు అందగా అందులో 8686 భూ హక్కు పత్రాలు రైతులకు అందజేశామన్నారు. 7,153 భూ హక్కు పత్రాలు ప్రింట్ రావాల్సి ఉందన్నారు. స్టోన్ ప్లాంటేషన్, భూ హక్కు పత్రాలు పంపిణీ పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ముట్లూరు గ్రామ సచివాలయాన్ని సందర్శించి జిల్లా స్థాయిలో ఇచ్చినటువంటి ఆదేశాలను క్షేత్ర స్థాయిలో వారు ఏవిధంగా అమలు చేస్తున్నారో ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉద్యోగులకు సూచించారు. గ్రామంలోని పలువురు రైతులకు భూహక్కు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తెనాలిలో వీణా అవార్డ్స్

- అక్టోబరు 20–24 తేదీల్లో..
- వీణా అవార్డ్స్–2023 నాటకోత్సవాలు
- ఏడు పద్యనాటకాలు, ఏడు సాంఘిక నాటికల ఎంపిక
- ఏఆర్ కృష్ణ, బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాల ప్రదానం



మాట్లాడుతున్న డాక్టర్ సాయిమాధవ్ బుర్రా

తెనాలి: పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక సంస్థ కళల కాణాచి ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న వీణా అవార్డ్స్–2023 నాటకోత్సవాలు అక్టోబరు 20–24 తేదీల్లో నిర్వహించనున్నారు. స్థానిక గాంధీనగర్‌లో శనివారం విలేకరుల సమావేశంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీరచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన స్క్రూటినీ ఫలితాలను తెలియజేశారు. స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జాతీయస్థాయి తృతీయ పద్యనాటక/సాంఘిక నాటికల పోటీలకు ఏడు పద్యనాటకాలు, ఏడు సాంఘిక నాటికలు, ప్రత్యేక ప్రదర్శనలుగా నాలుగు సాంఘిక నాటకాలను ఎంపిక చేసినట్టు తెలిపారు. తొలిరోజున పద్మభూషణ్ ఏఆర్ కృష్ణ జాతీయ రంగస్థల పురస్కారాన్ని ప్రఖ్యాత నటుడు నెమలికంటి తారక రామారావుకు, 24న బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాన్ని మరో ప్రముఖ నటుడు పొన్నాల రామసుబ్బారెడ్డి ప్రదానం చేస్తామని చెప్పారు. సంస్థ ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, వేమూరి విజయభాస్కర్, గోగినేని కేశవరావు, గోపరాజు విజయ్, మేరిగ రామలింగేశ్వరరావు, అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, బడుగు మోహనరావు, కొండముది రమేష్ బాబు, షేక్ అబ్దుల్ హకీంజాని పాల్గొన్నారు.

• గణనాథునికి ధనసేవ



వినుకొండ పట్టణం రంగనాయకస్వామి గుడి వద్ద బంగారు కొట్ల సెంటర్‌లో ఏర్పాటు చేసిన 14 అడుగుల భారీ గణనాథుడు విగ్రహానికి రూ.15లక్షల కరెన్సీతో అలంకరించి ధనసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. 108 మంది మహిళలు లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. అనంతరం విగ్రహదాత బండి మాధవకృష్ణను విగ్రహ కమిటీ ఘనంగా సత్కరించింది. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టి.మోహన్‌రావు, శ్రీరాం రాధాకృష్ణ, ఊటుకూరి శేషు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

– వినుకొండ(నూజెండ్ల)

చెరువులో జారిపడి విద్యార్థి మృతి



పుప్పాల గిరి (ఫైల్)

మంగళగిరి: తోటి స్నేహితులతో కలసి బహిర్భూకి వెళ్లిన ఆరో తరగతి విద్యార్థి చెరువులో జారిపడి మృతి చెందిన సంఘటన నవులూరు ఎంఎస్ఎస్ కాలనీలో చోటుచేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఎంఎస్ఎస్ కాలనీకి చెందిన పుప్పాల బాజి, కోటేశ్వరి దంపతుల కుమారుడు గిరి (12) అదే కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. కుమార్తె హర్షిత పదో తరగతి చదువుతోంది. శనివారం ఉదయం గిరి తన స్నేహితులతో కలసి బహిర్భూమికి వెళ్లాడు. పక్కనే ఉన్న గంగానమ్మ చెరువులో జారిపడిపోయి మునిగిపోయాడు. తోటి స్నేహితులు భయాందోళనతో పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే విద్యార్థి నీటిలో మునిగి మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు హుటాహుటీన సంఘటనా ప్రాంతానికి చేరుకున్న మంగళగిరి రూరల్ పోలీసులు గిరి మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లడ్డూ ప్రసాదం రూ.12.81లక్షలు



లడ్డూప్రసాదాన్ని వేలంలో దక్కించుకున్న బత్తుల రామారావు

నకరికల్లు: పల్నాడు జిల్లా దేచవరం గ్రామంలోని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని లడ్డూప్రసాదాన్ని రూ.12,81,000లకు బత్తుల రామారావు దక్కించుకున్నారు. గ్రామంలోని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర ప్రతిమ వద్ద 51 కేజీల లడ్డూప్రసాదాన్ని అలంకరించారు. శనివారం నిమజ్జనం సందర్భంగా స్వామివారి లడ్డూప్రసాదానికి ఉమ్మడి వేలం నిర్వహించారు. సుమారు 5గంటలపాటు ఉత్కంఠభరితంగా సాగింది. మొత్తం 10 మంది పోటీలో పాల్గొనగా ప్రధానంగా ముగ్గురి మధ్య పోటీ సాగింది. ఉత్కంఠభరితంగా సాగిన వినాయకుని లడ్డూ ప్రసాదం ఉమ్మడి వేలంలో బత్తుల రామారావు రూ.12.81లక్షలకు దక్కించుకున్నారు. కాగా ఇదే మండపం వద్ద లడ్డూప్రసాదాన్ని గతేడాది రూ.5.16లక్షలకు పాడడం మరో విశేషం. భక్తసంఘం వారు మాట్లాడుతూ లడ్డూప్రసాదం వేలంలో వచ్చిన మొత్తాన్ని ఈ ఏడాది ఉత్సవ ఖర్చులు మినహాయించి మిగిలిన మొత్తాన్ని స్వామివారి ప్రయోజనానికి వినియోగిస్తామని తెలిపారు.

కిడ్నాప్ చేశారంటూ దిశ యాప్‌కు ఫోన్

- ఐదు నిమిషాల్లో స్పందించిన సిబ్బంది
- జీపీఎస్‌తో లొకేషన్ గుర్తింపు
- ప్రయాణికురాలిని క్షేమంగా ఇంటికి చేర్చిన పోలీసులు
- టెస్ట్ కాల్ అని తెలిసి ఊపిరిపీల్చుకున్నారు

గుంటూరురూరల్: తనను కిడ్నాప్ చేశారంటూ ఓ మహిళ దిశ యాప్‌కు చేయగా స్పందించిన పోలీసులు ఐదు నిముషాల్లో లొకేషన్‌ను గుర్తించారు. ఆ మహిళను క్షేమంగా ఇంటికి చేర్చారు. తనను ఎవ్వరూ కిడ్నాప్ చేయలేదని టెస్ట్ కాల్ చేశానని ఆ మహిళ చెప్పడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ సంఘటన నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. నల్లపాడు పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో ఓ మహిళ తనను ఆటోలో కిడ్నాప్ చేశారని దిశ యాప్‌కు వీడియో మెసేజ్ చేసింది. వెంటనే దిశ పోలీసులు మహిళకు కాల్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. అలెర్ట్ అయిన పోలీసులు దిశ టెక్నికల్ టీం సహాయం తీసుకున్నారు. మహిళ ఫోన్ నెంబర్ జీపీఎస్ ట్రేస్ చేసి ఎక్కడ వెళ్తుందో గుర్తించారు. మహిళను కిడ్నాప్ చేసిన ఆటో నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో వెళ్తున్నట్లు గుర్తించారు. నల్లపాడు ఎస్‌హెచ్‌ఓకు దిశ టీం సమాచారం అందించారు. వెంటనే ఒక హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు జీపీఎస్ ఆధారంగా మహిళ వెళ్తున్న ఆటోను వెంటపడి పట్టుకున్నారు. ఆటో డ్రైవర్‌ను, ఆటోలో ఉన్న ముగ్గురు మహిళను పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. పోలీసుల విచారణలో మహిళ టెస్ట్ కాల్ చేసినట్లు తెలిపింది. తరువాత భయం వేసి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసినట్లు తెలిపింది. దిశ టీం, నల్లపాడు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ముగ్గురు మహిళకు పోలీసులు ధైర్యం చెప్పి క్షేమంగా వారి ఇంటివద్ద డ్రాప్ చేశారు. కిడ్నాప్ అని తెలిసిన వెంటనే తక్షణం స్పందించిన దిశ టీం, నల్లపాడు పోలీసులను దిశ ఉన్నతాధికారులు అభినందించారు.



దిశ యాప్‌కు కాల్ చేసిన మహిళ

అపార్టుమెంట్ పైనుంచి పడి బాలుడి మృతి

నరసరావుపేటటౌన్: అపార్ట్‌మెంట్ మూడో అంతస్తు నుంచి బాలుడు పడి మృతి చెందిన సంఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాష్‌నగర్‌లోని విజయ అపార్ట్‌మెంట్ మూడో అంతస్తులో సంగన మస్తాన్‌రెడ్డి నివాసం ఉంటున్నారు. ఆయన కుమారుడు మహేష్‌రెడ్డి(8) ఆడుకుంటూ మూడో అంతస్తు నుంచి కిందపడ్డాడు. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాలుడిని సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు.

కోల్డ్‌స్టోరేజ్‌ల స్టాకు వివరాలు ప్రతినెలా అందజేయాలి

మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ

కొరిటిపాడు(గుంటూరు): కోల్డ్ స్టోరేజీల యాజమాన్యం ప్రతినెలా స్టాకు వివరాలను మార్కెట్ యార్డు అధికారులకు అందజేయాలని గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ ఆదేశించారు. మిర్చి దిగుమతిదారుల అసోసియేషన్, కోల్డ్ స్టోరేజ్‌ల అసోసియేషన్, కార్మిక సంఘాల నాయకులు, అధికారులతో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజనారాయణ మాట్లాడుతూ యార్డు అధికారులు ఎప్పటికప్పుడు కోల్డ్‌స్టోరేజీలలో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. మచ్చుకాయల నియంత్రణలో భాగంగా కోల్డ్ స్టోరేజీల వద్ద ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, కోల్డ్‌స్టోరేజీల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాశరావు, సురేంద్రబాబు, మిర్చి దిగుమతిదారుల అసోసియేషన్ అధ్యక్షుడు లేళ్ల పెద అప్పిరెడ్డి, సాంబిరెడ్డి, కార్మిక సంఘం నాయకుడు శ్రీనివాసరెడ్డి, యార్డు అధికారులు శివారెడ్డి, సుబ్రమణ్యం, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



బాధితుడికి చెక్కును అందజేస్తున్న ఎంపీ నందిగం సురేష్

ఉద్దండరాయునిపాలెం(తాడికొండ): గుండెకు బైపాస్ సర్జరీ చేసిన బాధితుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.8 లక్షల సహాయాన్ని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అందజేశారు. బాపట్ల టౌన్‌కు చెందిన పోలా చెన్నయ్య అనే బాధితుడు గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సకు రూ.12 లక్షలు ఖర్చు చేశాడు. ఆర్థికంగా స్థోమత లేని బాధితుడు ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రెండు నెలల్లోనే రూ.8 లక్షల రూపాయలు మంజూరై బాధితుడికి చెక్కు వచ్చింది. శనివారం ఈ చెక్కును బాపట్ల ఎంపీ నందిగం సురేష్ అందజేయడంతో బాధితుడు హర్షం వ్యక్తం చేశారు. ఆపదలో ఆపన్న హస్తం అందిస్తున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి ఈ సందర్భంగా బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.1.11 లక్షలు పలికిన లడ్డూ



రామలింగేశ్వరపేటలో రూ.1,11,000లకు దక్కించుకున్న లడ్డూతో నిర్వాహకులు

తెనాలిఅర్బన్: శ్రీ గణేష్ భక్తబృందం ఆధ్వర్యంలో పుట్టా రాఘవయ్య రైస్ మిల్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. అక్కడ ఏర్పాటు చేసిన పెద్ద లడ్డూకు వేలంపాటలో రూ.1.11,000లు, చిన్న లడ్డూకు రూ.31 వేలు వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. పెద్ద లడ్డూను తొట్టెంపూడి నాగరాజు, మైలా నాగరాజు, చిన్న లడ్డూను జి.నరసింహారావు దక్కించుకున్నారు. అనంతరం ఊరేగింపుగా వినాయకుని ప్రతిమను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుంటూరు గోపి, చందు శ్రీనివాసరావు, కె.బాలాజీ, గోపాలరావు, శ్రీను, చందు, ఫణీ, తదితరులు పాల్గొన్నారు.

జారిపడి రైలు ప్రయాణికుడు మృతి

తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన దుగ్గిరాల రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు దుగ్గిరాల స్టేషన్ సమీపంలో పటాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. సుమారు 25 నుంచి 27 ఏళ్ల మధ్య వయసున్న యువకుడు మృతి చెంది ఉండడం గుర్తించారు. రైలు నుంచి జారి పడి ఉంటాడని, ఉత్తర భారతదేశానికి చెందిన వాడై ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే మెరుగైన సమాజం

- పారిశుధ్య కార్మికుల ఆరోగ్య రక్షణకు చర్యలు అభినందనీయం
- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



శిబిరాన్ని పరిశీలిస్తున్న ముస్తాఫా, వేణుగోపాల్ రెడ్డి, నూరి ఫాతిమా, సజిల, కీర్తి

నెహ్రూనగర్ (గుంటూరు తూర్పు): ఉద్యోగులు, కార్మికులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే మెరుగైన సమాజం, అభివృద్ధి సాధ్యపడుతుందని, పారిశుధ్య కార్మికుల ఆరోగ్య రక్షణకు గుంటూరు నగర పాలక సంస్థ మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సఫాయి మిత్ర సురక్ష శివిర్‌లో భాగంగా పారిశుధ్య, యూజీడీ కార్మికులకు బ్రహ్మానంద రెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంప్‌ను నగర కమిషనర్ కీర్తి చేకూరి, తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫాలతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పిన విధంగా ఉద్యోగులు ప్రభుత్వంలో కీలకమైన భాగమని, వారు ఆరోగ్యంగా ఉంటేనే ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత సమర్థవంతంగా అందుతాయన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో ముందుండే పారిశుధ్య కార్మికులకు గుంటూరు నగరపాలక సంస్థ నిష్ణాతులైన వైద్యులతో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటీవల జిల్లా కలెక్టరేట్ లో ఉద్యోగులకు సుమారు 8750 వైద్య పరీక్షలు చేపట్టడం జరిగిందని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెల 3వ శుక్రవారం ఎంప్లాయిస్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య రక్షణకు నగరపాలక సంస్థ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా పేద బడుగులు ఉండే పారిశుధ్య కార్మికులకు జీఎంసీ మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్మికులు ప్రతి ఒక్కరూ సమగ్ర వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్య పరీక్షల ఫలితాల మేరకు తగిన చికిత్స అందేలా నగరపాలక సంస్థ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు, ఆరోగ్య శ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ జయ రామకృష్ణ, డీటీసీఓ డాక్టర్ లక్ష్మా నాయక్ పాల్గొన్నారు.